సాక్షి జనగామ

మంగళవారం | 24 | జూన్ | 2025



ఓపెన్ స్కూల్.. ఓ వరం

చదువును మధ్యలోనే మానేసిన వారికి తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ద్వారా మళ్లీ చదివేందుకు అవకాశం కల్పిస్తోంది. - 8లో



ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు

విద్యుత్ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, విధిగా ఎల్‌సీ యాప్‌ను వాడాలని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
$34^0/26^0$

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రత ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బోధన చేసేదెవరు?

పాలకుర్తి: ఉపాధ్యాయులను తనిఖీ అధికారులుగా నియమిస్తే బోధన చేసేదెవరని, ఆ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలను తనిఖీ చేయడానికి ఎస్జీటీ, ఎస్‌ఏ ఉపాధ్యాయులను నియమించడం సరికాదన్నారు. రాష్ట్రంలో సుమారు 2వేల మంది ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించి ప్రతీ సంవత్సరం తనిఖీలు చేయాలని చెప్పడం సరికాదన్నారు. విద్యా సంవత్సరం పొడవునా వారు ఆయా బాధ్యతల్లో ఉండటం వలన బోధన తక్కువై విద్యార్థులకు నష్టం కలుగుతుందన్నారు. తరగతికి ఒక గది, ఉపాధ్యాయుడిని కేటాయిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇప్పటికే పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో బోధన స్తంభించి పోతుందన్నారు. ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడానికి డీఎస్సీ ప్రకటించాలని కోరారు.

ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించడం సరికాదు

జనగామ: పాఠశాల పర్యవేక్షణ బాధ్యతలు ఉపాధ్యాయులకు అప్పగించడం సరికాదని, ఉత్తర్వులను నిలిపివేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండీ షరీఫ్, ఇప్ప రాంరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ పాఠశాల పర్యవేక్షణకు ఇప్పటికే ఎస్‌ఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎంఈఓ, డీఈఓ, ఆర్జేడీలు, సంచాలకులు ఉండగా 2 శాతం ఉపాధ్యాయులను పర్యవేక్షణాధికారులుగా నియమించడం విద్యావ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెట్టివేయడమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చొక్కయ్య, యాదయ్య, దూడయ్య, శివరాం, శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసాచారి, శివాసారెడ్డి పాల్గొన్నారు.

నేడు రైతులతో సీఎం ముఖాముఖి

జనగామ రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట సాగుకై పెట్టుబడి సాయం రైతు భరోసా పథకం ద్వారా నిధులను విజయవంతంగా రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా నేడు (మంగళవారం) సాయంత్రం 6 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించేందుకు రైతు వేదికల వద్ద ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతీ రైతువేదికకు నోడల్ ఆఫీసర్‌గా ఆయా మండల అధికారులను నియమించినట్లు ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు, రైతులు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

పెన్షనర్లకు కేంద్రం అన్యాయం

జనగామ రూరల్: పాత పెన్షన్ పథకం స్థానంలో కొత్త పెన్షన్ పద్ధతిని ప్రవేశ పెట్టి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వచ్చే పెన్షన్‌కు కేంద్రం అన్యాయం చేసిందని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. మహేందర్‌రెడ్డి అన్నారు. ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లకు ముందస్తు సమాచారం లేకుండా అకస్మాత్తుగా లోక్‌సభలో ప్రవేశపెట్టి చట్ట రూపం దాల్చిందని, ఇది అన్యాయమన్నారు. ఈ బిల్లు రిటైర్డ్ ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనిట్ అధ్యక్షుడు కే.మహబూబ్ రెడ్డి, కార్యదర్శి జగదీశ్వరాచారి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తమ్మిశెట్టి మల్లికార్జున్, శోభ, హేమలత, విమలాదేవి, యాదవ రెడ్డి, కే.బాలయ్య, భిక్షపతి, రామన్న, రియాజ్, వి.విజయకుమార్, అఫ్జల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లకురుమలకు నగదు బదిలీ చేయాలి

జనగామ రూరల్: గొల్ల కురుమలకు గొర్రెల కొనుగోలుకు నగదు బదిలీ చేయాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోటే దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మల్లన్నగండి వద్ద ఉలిగిల్లి చంద్రయ్య అధ్యక్షతన సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గొల్లకురుమలకు పూర్తి స్థాయిలో గొర్రెలు పంపిణీ చేయలేదన్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతీ సొసైటీ సభ్యుడికి రూ.2 లక్షల గొర్రెల కొనుగోలుకు నగదు బదిలీ చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న గొల్లకురుములందరికీ వెంటనే నగదు బదిలీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సొసైటీ ఎన్నికలను నిర్వహించాలన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన గొర్రెల కాపరులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియన్ ఇవ్వాలన్నారు. అనంతరం జనగామ టౌన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉలిగిల్ల చంద్రయ్య, ఉపాధ్యక్షులు పతంగి రమేష్, భాస్కర్, ప్రధాన కార్యదర్శి మోటే నరేందర్, సహాయ కార్యదర్శులు ప్రశాంత్, రమేశ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పరిష్కారమేది..?

చెప్పులరిగేలా తిరుగుతున్నం.. సమస్యలు పరిష్కరించండి..

- గ్రీవెన్స్‌లో బాధితుల మొర
- ప్రజావాణిలో 74 అర్జీలు
- సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్

జనగామ రూరల్: కన్న కొడుకులు తిండి పెట్టడం లేదని, అక్రమంగా భూమిని పట్టా చేసుకున్నారని, ఏళ్ల తరబడి సాగు చేస్తున్నా.. రైతు భరోసా పడడం లేదని, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని.. ఇలా పలు సమస్యలతో ప్రజలు సోమవారం గ్రీవెన్సెల్‌కు వచ్చారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా వినతులు స్వీకరించారు. మొత్తం 74 వినతులు రాగా ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రగతి సాధించాలి

ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రగతి సాధించాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజాసమస్యలు సత్వరమే పరిష్కరించాలన్నారు. భూ భారతి కింద స్వీకరించిన దరఖాస్తులను వందశాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు రైతు భరోసా నిధులు జమ అయ్యాయని.. ఫర్టిలైజర్స్ కోసం రైతులు షాపులకు వస్తున్నందున.. నకిలీ విత్తనాల అమ్మకం జరగకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమంత్ నాయక్, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓలు గోపిరామ్, డి.ఎస్.వెంకన్న, డీఆర్‌డీఓ వసంత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు కొన్ని ఇలా

- రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి గ్రామానికి చెందిన సరగండ్ల రంజిత్ తల్లిదండ్రులు చనిపోవడంతో నానమ్మ దగ్గర ఉండి పదవ తరగతి వరకు చదువుకున్నానని, నానమ్మ కూడా ఇటీవల చనిపోవడంతో ఒంటరివాడిగా మిగిలానని, ఉన్నత విద్య చదివేందుకు అవకాశం కల్పించాలని విన్నవించాడు.
- నర్మెట మండలం సూర్యబండతండాకు చెందిన కేలోత్ అనిత ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.
- జనగామలోని రైతులకు వ్యవసాయంలో సాంకేతిక విజ్ఞానం అవసరముందని, అందుకు నూతన వంగడాలపై అవగాహన కల్పించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు యాదగిరి, రామకృష్ణ, భూక్యా చందు నాయక్ వినతి అందించారు.
- మున్సిపాలిటీలో హనుమకొండ రోడ్‌లోని సర్వే నెంబర్56 వెంచర్‌పై కోర్టు కేసు కొట్టివేశారని, ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతించాలని సొసైటీ అధ్యక్షుడు నానాజీ, ఇండ్ల పట్టాదారులు వీర్ రెడ్డి, నరసమ్మ తదితరులు విజ్ఞప్తి చేశారు.
- రఘునాథపల్లి మాజీ సర్పంచ్ పోకల శివకుమార్, సామాజిక కార్యకర్త ఠాకూర్‌గణేష్‌సింగ్‌లు అక్రమ నిర్మాణం, ఇసుక మాఫియాపై ఒకరిపై ఒక్కరు ఫిర్యాదు చేసుకున్నారు.
- తమ్మడపల్లి గ్రామానికి చెందిన రాపర్తి రజిత 20 ఏళ్ల నుంచి అద్దె ఇంట్లో ఉంటున్నానని, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంది.

అక్రమంగా పట్టా చేసుకున్నారు



కొడూర్ గ్రామంలో సర్వేనంబర్ 181.1లో 4.20 ఎకరాలు, 181/2లో 4.20 ఎకరాల భూమి ఉంది. 70 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నాం. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భూమిని 2015లో అక్రమంగా పట్టా చేసుకోవడానికి ప్రయత్నించగా అడ్డుకోగా తమకు తెలవకుండా ఆన్‌లైన్‌లో అనుభవదారులో పేరు నమోదు చేసుకున్నారు. విచారణ చేసి ఆ భూమిపై పట్టా పాస్ బుక్ ఇవ్వాలని కోడూర్ గ్రామ రైతులు వేడుకున్నారు.



ఓబుల్‌కేశవాపూర్‌కు చెందిన విజయ, శారద, కవితలు తమ తల్లి బడికె సుగుణ పేరుమీద సర్వేనంబర్ 367లో 2.5ఎకరాల భూమి ఉందని, గ్రామానికి చెందిన కొంతమంది 13 గుంటల భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని, అధికారులు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.



ఈఫొటోని వృద్ధుడు పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామానికి చెందిన దంప సోమల్లు. తన పేరు మీద గ్రామంలో 3 ఎకరాల భూమి ఉండగా తన ముగ్గురి కుమారుల పేరుమీద పట్టా చేసి ఇచ్చాడు. అనంతరం కుమారులు తన బాగోగులు చూడటం లేదని, గతంలో పెద్ద మనుషుల సమక్షంలో రూ. 3 లక్షలు ఇవ్వాలని చెప్పినా... పట్టించుకోవడం లేదని వాపోయారు. వారికిచ్చిన భూమిలో ఎకరం భూమి తన పేర పట్టా చేసి ఆసరా కల్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

వర్షం వస్తే తడవాల్సిందే..



గ్రామంలో తనకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. కనీసం ఉండానికి ఇల్లు కూడా లేదు. వర్షం వస్తే తడవాల్సిన పరిస్థితి ఉంది. తన కుమారుడు దివ్యాంగుడు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలి.

- బండి కమలమ్మ, అలీంపూర్, బచ్చన్నపేట

ప్రైవేటీకరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చందునాయక్



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ల ప్రైవేటీకరణ చేయాలని తీసుకువచ్చిన ముసాయిదా చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందునాయక్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో 2014 సంవత్సరంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటి వరకు అమలు చేయడంలేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం తమ ఆలోచనను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేదంటే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, నాయకులు నక్క యాకయ్య, నక్క సారయ్య, మహిళా నాయకురాలు రాపర్తి రజిత పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: యూపీఎస్సీ ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్ కోచింగ్‌కు ప్రవేశ పరీక్షకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.విక్రమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని, అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు ఉండాలని, డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ అభ్యర్థులు జూలై 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డయేరియాపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో డయేరియా క్యాంపెయిన్- 2025ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు చేపడుతున్న డయేరియా ప్రచారం విస్తృతంగా చేపట్టాలని, ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలు, సబ్ సెంటర్లు, పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలో ఐదు సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు ఓఆర్‌ఎస్ తాగించాలని, జింక్ టాబ్లెట్లు వాడాలన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక యాత్ర..

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నుంచి విహార యాత్ర ప్యాకేజీని రూపొందించిన ప్రత్యేక యాత్ర పోస్టర్‌ను కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ స్వాతితో కలిసి మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ ప్రత్యేక యాత్ర ప్రదేశాలు చూడాలనుకునే వారికి ఐదు రూట్‌లో ప్రయాణించేందుకు ప్రత్యేక విహార యాత్ర టూర్ ప్యాకేజీ అవకాశం కల్పించిందన్నారు. రూట్ -1లో రంగాపురం, బీచుపల్లి, జోగులాంబ యాత్రకు పెద్దలకు రూ.1100, పిల్లలకు రూ.600, రూట్-2లో పర్ణశాల, భద్రాచలం, కిన్నెరసాని డ్యాం, మల్లూరు, బొగత, మేడారం, రామప్ప, లక్నవరం ఉందని, పెద్దలకు రూ.1300, పిల్లలకు రూ. 700 చార్జీ కేటాయించినట్లు తెలిపారు. ఇలా రూట్ -3, 4, 5లో కూడా వివిధ ప్రదేశాలు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 7382852923, 7382852818, 9948164847, 7981951562 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎండీ హుస్సేన్, ఎస్‌ఎం ఎం. సమ్మయ్య, సూపరింటెండెంట్ వై.యాదమణిరావు, ఎం ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ క్రీడా సంబురాల పోస్టర్ ఆవిష్కరణ

సోషల్ వాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో తెలంగాణ క్రీడా సంబురాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ క్రీడలో గెలుపొందిన వారు మొదటి బహుమతిగా రూ.లక్ష పొందవచ్చన్నారు. యువత చెడు మార్గాన్ని వీడి, సన్మార్గంలో పయనించాలన్నారు.

విద్యార్థులు లక్ష్యాలు ఎంచుకోవాలి

- డీఈఓ భోజన్న



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డీఈఓ, ఉపాధ్యాయులు

బచ్చన్నపేట: ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని చదవాలని జిల్లా విద్యాధికారి భోజన్న అన్నారు. సోమవారం మండలంలోని ఇటుకాలపల్లి గ్రామంలోని సెకండరీ పాఠశాలలో ఆదిరెడ్డి అకాడమీ చైర్మన్, కల్నల్ సి.నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు వచ్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి ప్రోత్సాహంతో విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు విజయ, బాలకిషన్‌రావు, సుధాకర్, ఇంద్రసేనారెడ్డి, మధుకర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ గొట్టి కనుకయ్య, టీచర్లు లక్ష్మి, పావని, యాదగిరి, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఉన్నతస్థాయికి చేరుకోవాలి



ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

జనగామ రూరల్: యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్ కోరారు. సోమవారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉదయం నెహ్రూ పార్క్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఒలింపిక్ రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. దేశంలో క్రీడలు, క్రీడాకారులకు మంచి గుర్తింపు ఉందన్నారు. ఈ విషయాన్ని యువత గుర్తించి క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకట్‌రెడ్డి, సాయిచంద్ర ఫౌండేషన్ చైర్మన్ ఇరుగు సిద్దులు, బి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు సాగేదెలా?

రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇల్లు పూర్తయ్యేనా?

- ధరల నియంత్రణ చేసేదెవరు..?
- మెటీరియల్‌కు పెరిగిన ధరలు
- మేస్త్రీ, కూలీలకు ఒక్కొక్కచోట ఒక్కో రేటు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు!



చీటూరులో ఇందిరమ్మ ఇల్లుకు ముగ్గు పోస్తున్న నాయకులు (ఫైల్)

లింగాలఘణపురం: ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సాగెదెలా? అంటూ లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఒక్కసారిగా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో ఇన్నాళ్లు వేచి చూసిన వ్యాపారస్తులు ఒకేసారి దోచుకునేందుకు సిద్ధమయ్యారు. ఇసుక నుంచి మొదలుకొని సిమెంట్, స్టీలు, మేస్త్రీల రేటు, కూలీల ధరలు పెరగడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో ఇల్లు నిర్మాణం పూర్తయ్యేనా అంటూ ఆందోళనలో పడుతున్నారు. మండలంలో మొదటి విడతగా పైలెట్ ప్రాజెక్టుగా కొత్తపల్లిలో 35 ఇళ్లు మంజూరు చేయగా రెండో విడతగా 20 పంచాయతీల్లో 370 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే 200లకు పైగా ఇళ్లను ఆయా గ్రామాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు అట్టహాసంగా ముగ్గులు పోసి ప్రారంభోత్సవాలు చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధరలు ఇలా..

400 స్క్వేర్ ఫీట్లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇల్లు కట్టుకుంటే పునాదికి రూ.19,000, సిమెంట్ రూ.42,000, స్టీలు 800 కిలోలకు రూ.45,000, 20 ఎంఎం కంకర 4 ట్రాక్టర్లకు రూ.14,000, 40 ఎంఎం కంకర 2 ట్రాక్టర్లకు రూ.5,000, ఇసుక రవాణా చార్జీలు 8 ట్రాక్టర్లకు రూ.8,000, పునాది రాయికి 3 ట్రాక్టర్లకు, మేస్త్రీ చార్జీలు రూ.49,000, సిమెంట్ ఇటుకల గోడ నిర్మాణానికి రూ.1,10,200, ఆర్‌సీసీ దర్వాజలు, కిటికీలకు (బెండ్లు) రూ.17,000, తలుపులు, కిటికీలకు (డోర్స్) రూ.23,000, స్లాబు సెంట్రింగ్ చార్జీలు రూ.27,000, గోవ చార్జీలు రూ.13,000, కాంక్రీట్ మిల్లర్ కిరాయి, ప్లాస్టరింగ్‌కు రూ.34,000, ఇళ్లు పూర్తైన అనంతరం కరెంట్, శానిటరీ, నీటి సరఫరా, మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.66,000, కలరింగ్‌కు రూ.5,000 ఇలా రూ.5 లక్షలతో 400 స్క్వేర్ ఫీట్లలో ఇల్లు నిర్మించుకొనేందుకు ప్రభుత్వం ధరలను నిర్ణయించింది.



ఇంటి నిర్మాణానికి తోడిన పాదులు

క్షేత్రస్థాయిలో మరోలా..

ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల పూర్తి చేసేందుకు మేస్త్రీల రేటు రూ.1,35,000 లక్షలు నిర్ణయించగా ఒక్కొక్క గ్రామంలో ఒక్కో విధంగా కొనసాగుతుంది. అందులో స్క్వేర్ ఫీటు రూ.350 నుంచి రూ.450 వరకు ఉంది. ఇసుక ట్రిప్పు రవాణా చార్జీలతో కలిపి రూ.4,500, 20 ఎంఎం కంకర రూ.3,000, 40 ఎంఎం కంకర రూ.3,500, సిమెంట్ సాధారణ రకం బస్తాకు రూ.300, స్టీలు క్వింటాకు సాధారణ రకం రూ.5,600 ఇలా ప్రతీ మెటీరియల్‌కు ధరలు పెరిగిపోయాయి. పిల్లర్ల రంధ్రాలు తీసేందుకు జేసీబీతో ఒకదానికి రూ.800, కూలీలైతే రూ.1,200 వరకు చెల్లించాల్సి వస్తుంది. మండల స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ధరల నియంత్రణకు ఉన్న కమిటీ చర్యలు మాత్రం తీసుకోవడంలేదు.

ధరలు పెరిగాయి..



ప్రతీదానికి ధరలు పెరిగాయి. సిమెంట్, స్టీలు, ఇసుక, కూలీల రేట్లు ఇలా ప్రతీదానికి పెరిగాయి. ధరల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. నిరుపేదలు ఇల్లు కట్టుకొనేందుకు నానా కష్టాలు పడాల్సి వస్తుంది.

- ప్యాట మౌనిక, లింగాలఘణపురం, లబ్ధిదారురాలు

కొత్తగా ఏమీ పెంచలే..



గతంలో ఉన్న ధరలకే మేస్త్రీలు పనులు చేస్తున్నారు. కొత్తగా ఏమీ పెంచలే. ఇల్లు నిర్మాణాలను బట్టి ఒక్కొక్క గ్రామంలో ఒక్కొక్క రేటు ఉంది. పునాది, పిల్లర్లు, గోడలు, స్లాబు, బాత్ రూమ్ మొత్తం పనులకు స్క్వేర్ ఫీటుకు రూ.450 ఉంది. కేవలం గోడలు, స్లాబ్ వరకు రూ.350 నడుస్తుంది. ఇంటి యజమానులు ఎలా పనులు చేయించుకుంటే అలా రేటు ఉంటుంది.

- జాగిళ్లపురం రమేశ్, మేస్త్రీల సంఘం మండల అధ్యక్షుడు

మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

రఘునాథపల్లి: మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ జీపీ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉమ్మగోని రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులకు రెండు నెలలుగా నిలిచిపోయిన వేతనాలు గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలని, ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికుల పేర్లను నమోదు చేయాలన్నారు. జీఓ 51ని సవరించాలని, కారోబార్లను బిల్ కలెక్టర్లుగా ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని రూ.15 లక్షలకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు. ఈ సమావేశంలో జీపీ యూనియన్ నాయకులు సత్యనారాయణ, కొయ్యడ భిక్షపతి, రాపోలు రాజ్‌కుమార్, ఎండీ అజ్మత్, నల్ల రాజయ్య, నాగేష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు డీసీసీబీ మహాజన సభ

హన్మకొండ : వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మహాజన సభ నేడు (మంగళవారం) నిర్వహిస్తున్నట్లు ఆ బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వజీర్ సుల్తాన్ తెలిపారు. ఉదయం 11గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ మార్నేని రవీందర్ రావు అధ్యక్షతన ఈ సభ జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణాల పంపిణీ, వ్యవసాయ, విద్య రుణాల జారీ, వసూళ్లు వివిధ పథకాలపై చర్చించనున్నట్లు ఆయన వివరించారు. పూర్వ వరంగల్ జిల్లా పరిధిలోని పీఏసీఎస్ చైర్మన్లు, వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొనాలని కోరారు.

విద్యావేత్తలు రాజకీయాల్లోకి రావాలి

- ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ నరేందర్



కేయూ క్యాంపస్ : విద్యావేత్తలు రాజకీయాల్లోకి రావాలని అప్పుడే దేశంలో విలువల పాలన నిర్మితమవుతుందని ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ పేర్కొన్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్అండ్ సైన్స్ కాలేజీలో డాక్టర్ చింతం ప్రవీణ్‌కుమార్ తెలుగు విభాగం అధిపతిగా సోమవారం బాధ్యతలు స్వీకరించగా, సన్మానించారు. ఓబీసీ జాక్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి క్రాంతికుమార్, బీసీ ఉద్యోగ సంఘాల బాధ్యులు బుసగొండ ఓంకార్, చాపర్తికుమార్, వల్లాల జగన్‌గౌడ్, రాసమల్ల శ్రీనివాస్, నారాయణగిరి రాజు, నలుబాల రవికుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా 8 ప్రత్యేక రైళ్లు

- నేటినుంచి ప్రారంభం

కాజీపేట రూరల్ : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాజీపేట జంక్షన్ మీదుగా దక్షిణ మధ్య రైల్వే, బిలాస్‌పూర్ రైల్వే అధికారులు కాచిగూడ–బిలాస్‌పూర్ మధ్య 8 ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ సోమవారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..

జూన్ 23 నుంచి జూలై 7వ తేదీ వరకు బిలాస్‌పూర్‌లో ప్రతి సోమవారం బయలుదేరే బిలాస్‌పూర్–కాచిగూడ (08263) వెళ్లే ఎక్స్‌ప్రెస్ మంగళవారం కాజీపేటకు చేరుకొని వెళ్తుంది. అదేవిధంగా జూన్ 24వ తేదీ నుంచి జూలై 15వ తేదీ వరకు కాచిగూడ–బిలాస్‌పూర్ (08264) వెళ్లే ఎక్స్‌ప్రెస్ ప్రతి మంగళవారం కాజీపేట జంక్షన్‌కు చేరుకొని వెళ్తుంది. 3 ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో ప్రయాణించే ఈ రైళ్ల సర్వీస్‌లకు బిలాస్‌పూర్, రాయ్‌పూర్, దుర్గ్, రాజ్‌నందగాం, డోంగ్రగ, గోండియా, వద్సా, చాంద ఫోర్ట్, బల్హర్షా, సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల, రామగుండం, కాజీపేట, చర్లపల్లి, మల్కాజ్‌గిరి స్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు సీపీఆర్వో తెలిపారు.

ఓపెన్ స్కూల్.. ఓ వరం

చదువు మానేసిన వారికి సువర్ణావకాశం

- ఈసారి ముందస్తుగానే టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 117 అధ్యయన కేంద్రాలు



ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రంలో తరగతులకు హాజరైన అభ్యాసకులు (ఫైల్)

విద్యారణ్యపురి : ఆర్థిక పరిస్థితులు, కుటుంబ కారణాల వల్ల పాఠశాల స్థాయిలోనే కొందరు చదువును మధ్యలో మానేస్తున్నారు. మరికొందరు పదోతరగతి పూర్తయ్యాక ఇంటర్ చదువును కొనసాగించలేక పోతున్నారు. చదువుకోవాల్సిన వయస్సులోనే ఆడపిల్లలకు పెళ్లిలు చేయడంతో చదువుకోనే అవకాశం లేదు. ఇలాంటి వారికి తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ద్వారా మళ్లీ చదివేందుకు అవకాశం కల్పిస్తోంది. ఇది ఓ రకంగా చదువును మధ్యలో మానేసిన వారికి వరం లాంటిదంటే అతిశయోక్తి కాదు. సార్వత్రిక విద్యను దూర విద్య విధానంలో అందిస్తోంది. ఓపెన్ స్కూల్ విధానంలో టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మొత్తంగా 117 అధ్యయన కేంద్రాలు (ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూల్స్, ప్రభుత్వ జూనియర్ కాలేజీలు)ఉన్నాయి. 2008–09 విద్యా సంవత్సరం నుంచి ఓపెన్ స్కూల్ విధానంలో పదోతరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. 2010–11 నుంచి ఇంటర్‌లో ప్రవేశాలు అందుబాటులోకి వచ్చాయి.

ఆగస్టు 12వరకు అడ్మిషన్లు..

గతంలో ప్రతి ఏటా జూలై–ఆగస్టులో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు కల్పించే ప్రక్రియ ప్రారంభమయ్యేది. ఈసారి అలా కాకుండా రెగ్యులర్ విధానం వల్లే ఈ విద్యాసంవత్సరం 2025–26లో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల ప్రక్రియను అధికారులు ప్రారంభించి ఆగస్టు 12వ తేదీవరకు అడ్మిషన్లు కల్పిస్తారు. ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్ ద్వారా మీసేవా సెంటర్లలోనే ఫీజు చెల్లించి అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్లు పొందవచ్చు.

అక్షరాస్యత శాతం పెంచేందుకు..

ఓపెన్ స్కూల్ విధానంలో టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్ల ప్రక్రియకు అర్హులైన అభ్యాసకులు దరఖాస్తు చేసుకుంటారు. రాష్ట్రంలో అక్షరాస్యతను పెంచేందుకు ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) ప్రాజెక్టు ద్వారా ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు అర్హులైన వారిని కూడా సంబంధిత అధికారులు గుర్తిస్తున్నారు. ఉల్లాస్ ప్రాజెక్టు ఆఫీసర్, డీడీలను, సెర్ప్, మెప్మా, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్, వీఓ, సీఆర్పీలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎంఈఓలు, ఏఐ కోఆర్డినేటర్ల సహాయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో టెన్త్, ఇంటర్మీడియట్ చదివేందుకు అర్హులైన వారిని గుర్తిస్తున్నారు. టాస్‌లో అడ్మిషన్లు కల్పించేందుకు సర్వే ప్రక్రియ సైతం మొదలెట్టారు. అలా ఇప్పటి వరకు టెన్త్‌కు 1,581మందిని, ఇంటర్‌లో 1,952 మందిని గుర్తించారు. అడ్మిషన్లు పొందిన వారు ఎంపిక చేసుకున్న అధ్యయన కేంద్రాల్లో తరగతులకు హాజరు కావాల్సింటుంది. పాఠ్యపుస్తకాలు అందజేస్తారు. అలాగే ప్రతి రెండో శనివారం, ఆదివారం తరగతులు నిర్వహిస్తారు.

దరఖాస్తులు ఇలా..

- ఓపెన్ స్కూల్ టెన్త్‌లో ప్రవేశాలకు ఎలాంటి విద్యార్హత అవసరం లేదు. కనీస వయస్సు 15ఏళ్లు నిండి ఉండాలి. ఆపై వయస్సుగల వారు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చును. గరిష్ఠ వయోపరిమితి లేదు.
- తెలుగు, ఉర్దూ, ఆంగ్లం, హిందీ మీడియంలో ఏదైనా ఒక మాధ్యమాన్ని ఎంపిక చేసుకోవచ్చు.
- తహసీల్దార్ లేదా మున్సిపల్ నుంచి జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్ ఉంటే సరిపోతుంది.
- పాఠశాల స్థాయిలో చదువు మానేస్తే ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), ఆధార్ కార్డుతో ప్రవేశం పొందవచ్చు.
- ఇంటర్‌లో ప్రవేశాలకు తప్పనిసరిగా పదో తరగతి పాస్ కావాల్సి ఉంటుంది.
- ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆగస్టు 12వతేదీ వరకు అడ్మిషన్లు పొందాలి.
- పదోతరగతిలో ప్రవేశాలకు ఫీజు ఓసీ అభ్యాసకులకు రూ.1,550, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.1,150 చెల్లించాలి.
- ఇంటర్‌లో అడ్మిషన్లకు ఓసీలకు రూ.1,800, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యాసకులు రూ.1,500లు చెల్లించాల్సి ఉంటుంది.
- టీజీ ఆన్‌లైన్‌లో మీసేవా కేంద్రాల ద్వారా లేదా ఏపీ ఆన్‌లైన్ ద్వారా ఫీజులు చెల్లించి తమకు సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించి అడ్మిషన్లు తీసుకోవాలి.

ఉమ్మడి జిల్లాకు అడ్మిషన్ల టార్గెట్ 11,616

ఈ విద్యాసంవత్సరంలో ఓపెన్ స్కూల్ విధానంలో టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు 11,616 మంది అడ్మిషన్లను నిర్దేశించారు. గతేడాది టెన్త్, ఇంటర్‌లో 6,849 మంది అడ్మిషన్లు పొందారు. అందులో టెన్త్‌లో 2,401మంది, ఇంటర్‌లో 4,448 మంది ఉన్నారు.

రెగ్యులర్ విద్యతో సమానం..



ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్‌ను పూర్తి చేసిన వారికి రెగ్యులర్ చదువుతో సమానమైన గుర్తింపు ఉంటుంది. ఆగస్టు 12వరకు అడ్మిషన్లు కొనసాగుతాయి. ఓపెన్ స్కూల్ టెన్త్ పూర్తి చేసిన వారు ఆపై విద్యకు, ఇంటర్ పూర్తిచేసిన వారు ఉన్నత విద్యకు కూడా అర్హులే. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ తెలంగాణ ఓపెన్ స్కూల్. ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో కూడా పూర్తి వివరాలు లభిస్తాయి. ఉల్లాస్ ప్రాజెక్టు ద్వారా అర్హులైన వారిని గుర్తిస్తున్నాం. వారిని కూడా అడ్మిషన్లకు ప్రోత్సహించే ప్రక్రియ చేపట్టాం. ఆసక్తి గల వారికి ఇది ఒక అవకాశంగా భావించాలి

– అనగోని సదానందం, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్

తెరుచుకోని ప్రభుత్వ గిరిజన పాఠశాల

- విధులకు ఉపాధ్యాయుల గైర్హాజరు



తాళం వేసి ఉన్న సర్వన్‌తండా పాఠశాల

గార్ల : ఇద్దరు ఉపాధ్యాయులు సోమవారం విధులకు హాజరు కాకపోవడంతో ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల తాళం తెరుచుకోలేదు. అసలే ఈ పాఠశాల తెరిచిన నాటి నుంచి ఒక్క విద్యార్థి సైతం చేరలేదు. గార్ల మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీ సర్వన్‌తండా పాఠశాలలో ఉపాధ్యాయులే విధులకు డుమ్మా కొడుతుంటే, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించకుండా ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. ఇదే పాఠశాలలో ఆవరణలో కొనసాగుతున్న అంగన్‌వాడీ టీచర్‌ను వివరణ కోరగా ఇద్దరు ఉపాధ్యాయులు పాఠశాలకు రాలేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు స్పందించి ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలపై పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై హెచ్‌ఎం సీహెచ్ జోగయ్యను 'సాక్షి' వివరణ కోరగా సర్వన్‌తండా జీపీఎస్ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు సోమవారం విధులకు హాజరు కాలేదని వివరించారు.

బాలికను వేధించిన నిందితుడికి జైలు

వరంగల్ లీగల్ : ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ప్రేమించమని వెంటాడి వేధింపులకు గురిచేసిన నేరం రుజువుకావడంతో రాయపర్తి మండలం కొండూర్ గ్రామానికి చెందిన దాసరి రజనీకాంత్‌కు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి మనీషాశ్రావణ్ ఉన్నమ్ సోమవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కొండూర్ గ్రామానికి చెందిన బాలిక ఇంటర్మీడియేట్ చదువుతూ సెలవుల్లో ఇంటి వద్ద ఉంటుంది. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన రజనీకాంత్ తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకుంటానని తరుచూ వెంటపడి వేధిస్తున్నాడని బాధిత బాలిక తన తండ్రికి తెలుపగా మందలించారు. 2022, జనవరి12న రజనీకాంత్ నేరుగా బాలిక తండ్రికి ఫోన్ చేసి 'మీ అమ్మాయిని ప్రేమిస్తున్నా.. నాకు ఇచ్చి పెళ్లి చేయాలని' అసభ్యంగా తిట్టాడు. పెద్దల సమక్షంలో పిలిపించినా రజనీకాంత్ రాకపోవడంతో చర్య తీసుకోవాలని రాయపర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. విచారించిన కోర్టు సాక్ష్యాలను పరిశీలించి నేరం రుజువు కావడంతో పోక్సో చట్టం సెక్షన్–12 కింద ఆరు నెలలు, ఐపీసీ సెక్షన్ 354, 354 (డీ) కింద ఆరు మాసాలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. కాగా ఈ శిక్షలను ఏకకాలంలో అమలుపర్చాలని జడ్జి మనీషాశ్రావణ్ ఉన్నమ్ తీర్పులో పేర్కొన్నారు. కేసును సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.రాజేందర్, బి.రాజు పరిశోధించగా లైజన్ ఆఫీసర్ కె.హరికృష్ణ, భరోసా అధికారి నీరజ పర్యవేక్షణలో హెడ్‌కానిస్టేబుల్ సోము నాయక్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పీపీ డి.బృందాదేవి కేసును వాదించారు.

ట్రాక్టర్ బోల్తా.. అన్నదాత దుర్మరణం

- లక్ష్మారెడ్డిపల్లెలో ఘటన



ట్రాక్టర్ బోల్తాపడి మృతిచెందిన రాంరెడ్డి

గణపురం : సొంత వ్యవసాయ భూమిలో కల్టివేటర్‌తో దున్నుతుండగా ట్రాక్టర్ బోల్తా పడి రైతు ఒద్దుల రాంరెడ్డి (46) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషాద ఘటన సోమవారం గణపురం మండలం లక్ష్మారెడ్డి పల్లెలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన రైతు రాంరెడ్డి తన భూమిలో సొంత ట్రాక్టర్‌తో దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు రాంరెడ్డిని బయటకు తీసే ప్రయత్నం చేసిన సాధ్యపడలేదు. వెంటనే క్రేన్ సహాయంతో ట్రాక్టర్‌ను పక్కకు జరిపి రాంరెడ్డి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య జ్యోతి, కుమారుడు, కూతురు ఉన్నారు. జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. అందరితో కలిసిమెలిసి ఉండే రాంరెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బైక్ అదుపుతప్పి ఆర్‌ఎంపీ మృతి



సుదర్శన్(ఫైల్)

ఎల్కతుర్తి : బంధువుల వేడుకకు వెళ్లి వస్తుండగా బైక్ అదుపుతప్పి ఓ ఆర్‌ఎంపీ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం భీమదేవపల్లి మండలం గట్లనర్సింగాపూర్ శివారులో జరిగింది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం జగన్నాథపూర్ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ చిర్ర సుదర్శన్ (60) ఆదివారం హుస్నాబాద్‌లో జరిగిన బంధువుల ఫంక్షన్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్లి అర్ధరాత్రి 1గంటకు తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడి పోయాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగుడు

రాయపర్తి : వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన మండలంలోని మైలారంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన తుమ్మ సావిత్రమ్మ తెల్లవారుజామున 3గంటలకు ఇంటి తలుపు తెరిచి బాత్రూంకు వెళ్లింది. ఈక్రమంలో వెనకాలే వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. బాధితురాలి కుమారుడు తుమ్మ యాకూబ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు. వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, సీసీఎస్ డీసీపీ బోనాల కిషన్, ఏసీపీ సదయ్య, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ శ్రీనివాస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వివరాలను బాధితురాలిని అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని తెలిపారు.

ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు

- ఎల్‌సీ యాప్‌ను విధిగా వాడాలి
- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



హనుమకొండ సర్కిల్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ ఉద్యోగ అమరుల స్మృతి చిహ్నం ఆవిష్కరణలో పాల్గొన్న సీఎండీ వరుణ్‌రెడ్డి, డైరెక్టర్లు, ఎస్ఈలు, డీఈలు

హన్మకొండ : విద్యుత్ ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో నిర్మించిన విద్యుత్ ఉద్యోగ అమరుల స్మృతి చిహ్నాన్ని సీఎండీ వరుణ్ రెడ్డి ఆవిష్కరించారు. సీఎండీతో పాటు డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు పూలమాల వేసి విద్యుత్ అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదకరమైనదని తెలిసి నిర్లక్ష్యంగా ఉంటూ ప్రాణాల మీదికి తెచ్చుకోవడం బాధాకరమన్నారు. ఎల్‌సీ యాప్‌ను విధిగా వాడాలన్నారు. విద్యుత్ ఉద్యోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధినిర్వహణలో విద్యుత్ ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పుతున్న వారి జ్ఞాపకార్థం 16 సర్కిళ్లలో స్మృతి చిహ్నాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ క్రమంలో ముందుగా హనుమకొండ సర్కిల్‌లో నిర్మించామని తెలిపారు. ప్రతి ఏటా విద్యుత్ ఉద్యోగుల సంస్మరణ దినాన్ని నిర్వహించనున్నట్లు, మృతిచెందిన ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలన్ని 45 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా క్షేత్రస్థాయి వరకు ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, టి.మధుసూదన్, వి.తిరుపతి రెడ్డి, సీఈలు కె.తిరుమల్ రావు, రాజు చౌహాన్, రవీంద్రనాథ్, హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, వరంగల్ ఎస్ఈ కె.గౌతమ్ రెడ్డి, డీఈలు ఎ.విజేందర్ రెడ్డి, జి.సాంబరెడ్డి, సామ్య నాయక్, దర్శన్ కుమార్, భిక్షపతి, ఆనందం, హర్షి, ఎస్ఏఓ నవీన్ కుమార్, ట్రేడ్ యూనియన్ నాయకులు ఇనుగాల శ్రీధర్, కె.వి.జాన్సన్, మన్నె శశి కుమార్, అజ్మీరా శ్రీరామ్ నాయక్, బి.దానయ్య, కుమార స్వామి పాల్గొన్నారు.

సమస్యలపై సీఎండీ సానుకూల స్పందన

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి, ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు బొల్లి వెంకటరాజు, కార్యదర్శి ఎ.ఆంజనేయులు తెలిపారు. సోమవారం హనుమకొండలోని ప్రధాన కార్యాలయంలో వారు సీఎండీని కలిసి వినతిపత్రాన్ని అందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. తమ సమస్యలు విన్న సీఎండీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. వచ్చే నెలలో విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ల బదిలీలు ఉంటాయని చెప్పారన్నారు. టీయూఈఈయూ నాయకులు శ్రీనివాస్, సుదర్శన్ వర్మ, సంతోష్, కర్నాల అనిల్ కుమార్, మధుసూదనరావు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులను చదివిస్తాం..

- పాఠశాలలో చేర్పించిన సీనియర్ సివిల్ జడ్జిలు



చిన్నారులను సాయిస్పందన హైస్కూల్‌లో చేర్పించిన సీనియర్ సివిల్ జడ్జిలు, పక్కన గార్డియన్ విజయ్ తదితరులు

విద్యారణ్యపురి : తల్లిదండ్రుల మృతితో అనాథలైన చిన్నారులను న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) హనుమకొండ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే, డీఎల్ఎస్ఏ వరంగల్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సాయికుమార్ సోమవారం హనుమకొండలోని వివేకానందనగర్‌లోని సాయిట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయిస్పందన హైస్కూల్‌లో చేర్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం పోతరాజుపల్లికి చెందిన ఓని రమేశ్, అతడి భార్య తిరుపతమ్మ ఆరునెలల క్రితం మరణించారు. వీరికి కుమారులు గౌతమ్, గర్విక్ ఉన్నారు. కాగా రమేశ్ అన్న విజయ్ ప్రస్తుతం హనుమకొండలోని భవానినగర్‌లో ఉంటున్నాడు. తమ్ముడి పిల్లల ఆలనాపాలనకు తాము గార్డియన్‌గా ఉన్నామని అయితే వీరిని చదివించే స్థోమత తమకు లేదని వీరికి హాస్టల్ వసతితో పాటుగా విద్యను అందించే సదుపాయం కల్పించాలని ఇటీవల విజయ్ హనుమకొండ జిల్లా న్యాయసేవాధికారి సంస్థకు వినతి పత్రం అందజేశారు. దీంతో స్పందించిన డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి హనుమకొండ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, వరంగల్ డీఎల్ఎస్ఏ సెక్రటరీ సాయికుమార్ చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సహకారంతో సోమవారం ఇద్దరు చిన్నారులను వివేకానందనగర్‌లోని సాయిస్పందన హైస్కూల్‌లో చేర్పించారు. గౌతమ్‌ను 5వ తరగతిలో, గర్విక్‌ను ఒకటోతరగతిలో చేర్పించారు.

రాజస్థాన్‌లో మిస్సింగ్.. తెలంగాణలో ప్రత్యక్షం

- ఇద్దరు బాలికలు రైల్లో వెళ్తుంటే గుర్తించిన టీటీఈ
- చైల్డ్‌లైన్‌కు అప్పగించిన రైల్వే పోలీసులు

కాజీపేట రూరల్ : రాజస్థాన్‌లో ఇంటి నుంచి తప్పిపోయిన ఇద్దరు బాలికలు సోమవారం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యక్షమై రైల్లో వెళ్తుంటే డ్యూటీలో ఉన్న రైల్వే టీటీఈ శివ గుర్తించి పోలీస్‌కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో కాజీపేట జీఆర్‌పీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాజీపేట జీఆర్‌పీ సీఐ వి.నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. ఇటీవల రాజస్థాన్‌కు చెందిన 17 ఏళ్ల విద్యార్థినులు పూజా కుమారి, కాజల్ టాగూర్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వచ్చారు. సోమవారం సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్లే కర్ణాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన వారి వివరాలను టీటీఈ తెలుసుకుని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో కాజీపేట స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులను సిద్ధంగా ఉంచి రైల్లో ఉన్న మైనర్లను దించి స్టేషన్‌కు తరలించారు. తర్వాత రాజస్థాన్ రుడవాయి పోలీసులకు, వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని, వారు వచ్చే వరకు బాలికలను చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ ప్రభాను పిలిపించి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ విజేత కానిపర్తి



ట్రోఫీ అందుకుంటున్న కానిపర్తి జట్టు

కమలాపూర్ : ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని కానిపర్తి జట్టు నిలిచింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్‌నగర్‌లో నిర్వహించిన ఆరు జిల్లాల స్థాయి ఆహ్వానిత బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మొత్తం 12 జట్లు పాల్గొనగా కానిపర్తి, భూపాలపల్లి జట్లు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం జరిగిన ఫైనల్‌లో భూపాలపల్లి జట్టుపై కానిపర్తి జట్టు గెలిచి టోర్నీని కైవసం చేసుకుంది. విజేతగా నిలిచిన జట్టుకు నిర్వాహకులు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేశారు. కానిపర్తి జట్టుకు కోచ్‌గా కన్నెబోయిన కిరణ్‌యాదవ్, కెప్టెన్‌గా దాసరి రమేష్ వ్యవహరించారు.

పాకిస్తానీ వలసదారుల భూములకు కోర్టు ఉత్తర్వులు

- లబోదిబోమంటున్న రైతులు
- 70ఏళ్లకు పైగా సాగులో ఉన్నామని ఆవేదన



వినతిపత్రం చూపిస్తున్న కుందారం రైతులు

జనగామ రూరల్: దేశ విభజన అనంతరం పాకిస్తానీలు దేశం విడిచి వెళ్లిపోయిన నేపథ్యంలో వారి ఆధీనంలో ఉన్న అప్పటి భూములకు పట్టాలు పొందిన లింగాలఘణపురం మండలం కుందారం గ్రామానికి చెందిన రైతులకు నేడు కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి లావాదేవీలు నిర్వహించకుండా చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సోమవారం జనగామ కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో బాధిత రైతులు తమ గోడును కలెక్టర్ ఎదుట వెళ్లబోసుకున్నా ఫలితం లేకుండా పోయింది. వివరాలిలా ఉన్నాయి.. జలాలుద్దీన్ అన్వర్ పేరుతో సీటీ సివిల్ కోర్టు సదరు భూముల్లో ఎలాంటి లావాదేవీలు నిర్వహించవద్దని స్టే తీసుకురావడంతో రైతులు ఆ వ్యక్తి ఎవరో తమకు తెలియదని, అలాంటి వ్యక్తికి కోర్టు ఉత్తర్వులు ఇవ్వడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. 1952లో మున్వర్ హైదర్ అనే వ్యక్తి పాకిస్తాన్‌కు వెళ్లిపోగా అప్పటి నుంచి ఆ భూములు తమ ఆధీనంలో ఉన్నాయని, 1989లోనే కస్టోడియన్ ఆఫ్ ప్రాపర్టీ కింద అప్పటి ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని చెప్పారు. 2018లో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి పాసుపుస్తకాలు కూడా జారీ చేసిందని, ఇటీవల రైతు భరోసా రావడంలేదని, రిజిస్ట్రేషన్ కావడంలేదని వాపోయారు. జిల్లాలో లింగాలఘణపురం, రఘునాథపల్లి, జఫర్‌గఢ్, పాలకుర్తి, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ మండలాల్లో వందలాది ఎకరాల భూములకు ఇలాంటి పరిస్థితి ఉంది.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

- పోలీసులను అభినందించిన వరంగల్ సీపీ



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

జనగామ రూరల్ : జనగామ మండలం తుకుంబాయి తండాలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు సోమవారం డీసీపీ రాజమహేంద్ర నాయక్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. జనగామ పట్టణానికి చెందిన సామాను శివ, ప్యారాల సంపత్, ఒగ్గు మహేష్, మాదాసు శివ, కోమటి రాజశేఖర్ మద్యం తాగి పథకం ప్రకారం దొంగతనానికి పాల్పడ్డారని తెలిపారు. పాత నేరస్తుడైన సామాను శివతో స్నేహం చేసి, మిగతావారు కూడా శివ లాగానే దొంగతనం చేయాలని నిర్ణయించారు. ఈనెల 19వ తేదీరాత్రి దొంగతనం చేద్దామని మద్యం తాగి తిరుగుతుండగా, వెంకిర్యాల తుకుంబాయితండాకు చెందిన వాకిటి రామకృష్ణ రెడ్డి ఇంటికి తాళం వేసిఉండగా దాన్ని పగులగొట్టి, లోపలికి వెళ్లి బీరువాలో ఉన్న బంగారు వస్తువులను దొంగలించారు. బాధితుడు రామకృష్ణ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ సూచనల మేరకు ఏఎస్పీ పండరిచేతన్ నితిన్, సీఐ దామోదర్ రెడ్డి పర్యవేక్షణలో సోమవారం ఎస్సై చెన్నకేశవులు తన సిబ్బందితో యశ్వంతపూర్‌లో పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈక్రమంలో నిందితులు బైక్‌పై వస్తుండగా అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే సిబ్బందితో పట్టుకొని వారిని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి బంగారు ఆభరణాలు, టీవీఎస్, బజాజ్ పల్సర్, లక్ష రూపాయల నగదు, మణప్పురం గోల్డ్ లోన్ రశీదు, 4తులాల గొలుసు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన జనగామ సీఐ పి.దామోదర్ రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు, కానిస్టేబుళ్లను వరంగల్ సీపీ అభినందించారు.